సాక్షి
పశ్చిమగోదావరి

ఆదివారం । 21 । సెప్టెంబర్ । 2025



ఎరువుల షాపులపై దాడులు

జీలుగుమిల్లిలో ఎరువుల డిపోలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, వ్యవసాయ అధికారులు సంయుక్తంగా దాడులు చేశారు. 10లో ▸



నారికేళం.. 'ధర'హాసం

కొబ్బరికాయల ధర మరింత పెరిగింది. దసరా, దీపావళి, అనంతరం కార్తీకమాసం సీజన్ దృష్ట్యా ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. 10లో ▸



బంగారు ఆభరణాల అపహరణ

ఒంటరిగా ఇంట్లో ఉన్న మహిళపై కర్రతో దాడి చేసి ఆమె ఒంటిపై బంగారు ఆభరణాలను దుండగుడు అపహరించుకుపోయాడు. 10లో ▸

ఇసుకపై అధనపు దోపిడీ

కూటమి ఇసుకాసురులు

- జిల్లాలోని స్టాక్ పాయింట్లలో భారీగా ధరలు
- పక్క జిల్లాలో తక్కువ ధరకే ఇసుక లభ్యం
- వినియోగదారులపై లారీకి రూ.5 వేల వరకు భారం
- బయటి నుంచి తీసుకురాకుండా అడ్డుకుంటున్న స్టాక్ పాయింట్ నిర్వాహకులు
- కలెక్టర్‌కు ఉమ్మడి జిల్లా టిప్పర్ లారీ అసోసియేషన్ ఫిర్యాదు

'జిల్లా కలెక్టర్ వారికి.. తాడేపల్లిగూడెం వెళ్లే ఇసుక లారీలు బయట ప్రాంతాల నుంచి లోడ్ తీసుకురావద్దని, లోకల్‌గా ఉన్న ఇసుక స్టాక్ యార్డ్ నుంచే తోలుకోవాలని ఇబ్బంది పెడుతున్నారు. వీరికి పోలీసు, రెవెన్యూ వారు సహకరిస్తున్నారు. పరిశీలించి చర్యలు తీసుకోగలరు'

– ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా టిప్పర్ లారీ అసోసియేషన్



స్టాక్ పాయింట్‌లో ఇసుక

సాక్షి, భీమవరం: జిల్లాలోని స్టాక్ పాయింట్లలో ఇసుక ధరలు వినియోగదారులకు భారమవుతున్నాయి. ఇక్కడ లోడింగ్ అయ్యే ఖర్చుకంటే తక్కువకే బయటి నుంచి ఇసుక వచ్చేస్తోంది. దీంతో బయటి ప్రాంతాల నుంచి ఇసుక రాకుండా నిర్వాహకులు అడ్డుకుంటున్నారని, అందుకు అధికారులు సహకరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

వేల టన్నుల్లో ఇసుక నిల్వలు

గోదావరి వరదల సమయంలో ఇసుక కొరత రాకుండా స్టాక్ పాయింట్లు ఏర్పాటుకు ఏప్రిల్‌లో జిల్లా శాండ్ కమిటీ నిర్ణయించింది. నియోజకవర్గానికి ఒకటి చొప్పున స్టాక్ పాయింట్ నిర్వహణ బాధ్యతల్ని ఏజెన్సీలకు అప్పగించారు. జిల్లాకు ప్రత్యేకంగా కేటాయించిన తూర్పుగోదావరి జిల్లా పెండ్యాల ఓపెన్ రీచ్ నుంచి 5 లక్షల టన్నుల ఇసుకను నిల్వ చేయాలన్నది లక్ష్యం. కాగా 1.20 లక్షల టన్నులు స్టాకు పెట్టినట్టు సమాచారం. ఆచంట స్టాక్ పాయింట్‌లో 20,100 టన్నులు పెట్టగా, భీమవరంలో 6,240, నరసాపురంలో 2,450, పాలకొల్లులో 19,555, తాడేపల్లిగూడెంలో 35,180, తణుకులో 7,878, ఉండిలో 28,990 టన్నులు నిల్వ చేశారు.

దూరాన్ని బట్టి ధర..

ఇసుక ర్యాంపు నుంచి ఆయా స్టాక్ పాయింట్లకు ఉన్న దూరాన్ని బట్టి ఒక్కో టన్నుకు రూ.306 నుంచి రూ. 581 ధరగా నిర్ణయించారు. ఆచంట స్టాక్ పాయింట్‌లో టన్నుకు రూ.444, భీమవరం, నరసాపురంలలో రూ. 581, పాలకొల్లులో రూ.556, తాడేపల్లిగూడెంలో రూ.456, తణుకులో రూ.306, ఉండిలో రూ.550 ధరలుగా నిర్ణయించారు. వీటికి లోడింగ్, జీఎస్టీ చార్జీలు అదనంగా వసూలు చేస్తున్నట్టు లారీ యజమానులు చెబుతున్నారు. కూటమి నేతల పర్యవేక్షణలోనే స్టాక్ పాయింట్లు నడుస్తున్నాయి.

వేధింపులు ఆపాలి



బయటి ప్రాంతం నుంచి లోడ్ తీసుకురావద్దని, లోకల్‌గా ఉన్న యార్డులోనే ఇసుకను తీసుకువెళ్లాలని తాడేపల్లిగూడెంలో ఇబ్బందులకు గురిచేస్తున్నారు. తనిఖీల పేరిట అధికారులు వారికి వత్తాసు పలకడం సరికాదు. తక్కువ ధరకు వినియోగదారులకు ఇసుకను ఇచ్చే ఏర్పాటు చేయాలి. కిరాయిలు లేక లారీ యజమానులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. వేధింపులపై చర్యలు తీసుకోవాలని జిల్లా అసోసియేషన్ తరఫున కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం.

– రావూరి రాజా, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

ధరల బాదుడు

తాడేపల్లిగూడెం స్టాక్ పాయింట్‌లో ఆరు యూనిట్ల లారీ (24 టన్నులు) లోడింగ్‌కు రూ.12,000 వరకు తీసుకుంటున్నట్టు లారీ యజమానులు చెబుతున్నారు. వినియోగదారులకు చేరవేసేందుకు రవాణా చార్జీలు అదనం. స్టాక్ పాయింట్ నుంచి వినియోగదారునికి చేరే సరికి దూరాన్ని బట్టి లారీకి రూ.16 వేల నుంచి రూ.17 వేలు వరకు వ్యయమవుతోంది. తూర్పుగోదావరి జిల్లా తీపర్రు, పురుషోత్తపల్లి స్టాక్ పాయింట్ల వద్ద లోడింగ్‌కు బిల్లుతో రూ.6,500 వరకు తీసుకుంటుండగా రవాణాతో కలిపి ఆరు యూనిట్ల లారీ రూ.11,500లకు తాడేపల్లిగూడెంకు చేరవేస్తున్నారు. లారీకి రూ.4,500 వరకు ధర తగ్గుతుండటంతో బయటి ప్రాంతం వైపే వినియోగదారులు మొగ్గుతున్నారు. దీంతో స్టాక్ పాయింట్ల నిర్వాహకుల దృష్టి బయటి నుంచి వస్తున్న లారీలపై పడింది. కూటమి నేతల కనుసన్నల్లోనే ఇక్కడ ఇసుక వ్యాపారం జరుగుతోంది. వారు తెర వెనుకుండి ఇతర ప్రాంతాల నుంచి ఇసుక లోడ్‌తో వస్తున్న లారీలను ఆపి తనిఖీల పేరిట వేధింపులకు గురిచేస్తున్నారని లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు అంటున్నారు. అందుకు అధికారులు వత్తాసు పలుకుతున్నారంటున్నారు. ఇప్పటికే కిరాయిలు లేక ఫైనాన్స్‌లు చెల్లించలేని పరిస్థితిల్లో ఉంటే వేధింపులతో తమ పరిస్థితి మరింత దయనీయంగా మారుతోందని వాపోతున్నారు. ఉండి స్టాక్ పాయింట్ వద్ద టన్ను ధర రూ.600 కాగా, లోడింగ్, రవాణా వినియోగదారులే చూసుకోవాలంటున్నారని స్టాక్ పాయింట్ సిబ్బంది సూచిస్తున్నారు. జిల్లాలోని స్టాక్ పాయింట్లపై అధికారులు దృష్టి సారించి ప్రజలకు తక్కువ ధరకే ఇసుక సరఫరాకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తీర ప్రాంత పరిశుభ్రతకు పాటుపడాలి

కలెక్టర్ నాగరాణి



మొగల్తూరు మండలం పేరుపాలెం బీచ్‌లో చెత్త ఎత్తుతున్న కలెక్టర్ నాగరాణి

నరసాపురం: తీర ప్రాంత పరిరక్షణ, బీచ్‌ల సుందరీకరణకు ప్రతిఒక్కరూ పాటుపడాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి సూచించారు. అంతర్జాతీయ తీర ప్రాంత పరిశుభ్రతా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మొగల్తూరు మండలం పేరుపాలెం బీచ్ వద్ద బీచ్ క్లీనింగ్ క్యాంపెయిన్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, డ్వాక్రా, మెప్మా మహిళలు, అధికారులతో కలిసి బీచ్ క్లీనింగ్‌లో కలెక్టర్ పాల్గొని స్వయంగా చెత్త ఎత్తారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నతనం నుంచే విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కల్పించడం ద్వారా కాలుష్య నియంత్రణకు పాటుపడవచ్చన్నారు. క్లీనింగ్ కార్యక్రమం ప్రతిరోజు నిర్వహించాలన్నారు. ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ స్థిరమైన ఆహార అలవాట్లను ఆరోగ్యకరమైన జీవన శైలిని అవలంబించుకోవాలని సూచించారు. నరసాపురం ఆర్డీఓ దాసిరాజు, డీఎస్పీ శ్రీవేద, జిల్లా నోడల్ అధికారి వై.దోసిరెడ్డి, జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఈ.వెంకటేశ్వర్లు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి బి.శ్రీనివాసరావు, జిల్లా చేనేత అధికారి కె.అప్పారావు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతి రావు, డీఈఓ ఈ.నారాయణ, జిల్లా టూరిజం అధికారి ఏవీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

గళమెత్తిన వీఆర్‌ఏలు



తాడేపల్లిగూడెంలో ఆర్డీఓ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందిస్తున్న వీఆర్‌ఏలు

తాడేపల్లిగూడెం: దీర్ఘకాల సమస్యల పరిష్కారం కోరుతూ గ్రామ రెవెన్యూ సహాయకుల జిల్లా సంఘం ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట వీఆర్‌ఏలు ధర్నా చేశారు. వీఆర్‌ఏలకు పేస్కూల్ వర్తింపజేయాలని, పదోన్నతులకు అర్హులైన వీఆర్‌ఏలను ఖాళీగా ఉన్న వీఆర్‌ఓ, అటెండర్స్, వాచ్‌మెన్, డ్రైవర్ పోస్టుల్లో భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేశారు. నామినీగా చేస్తున్న వీఆర్‌ఏలను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటలకు శాంతియుతంగా ధర్నా చేశారు. అనంతరం జిల్లా సంఘ అధ్యక్షుడు బుంగా గణేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఎం. మోషే ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయ అధికారులకు వినతిపత్రం సమర్పించారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ఆపాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న బలరామ్

భీమవరం: ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌పరం చేసేందుకు కూటమి సర్కారు తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. శనివారం భీమవరంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బి.బలరామ్ మాట్లాడుతూ వైద్య విద్యను ప్రైవేటుకు అప్పగిస్తే ఖరీదుగా మారి, వైద్య విద్య వ్యాపారంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏపీ సంచార జాతుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పెంద్ర వీరన్న మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటుకు అప్పగించడం సరికాదన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెల్లబోయిన రంగారావు, ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర నాయకుడు లంకా కృష్ణమూర్తి, ఎంసీపీఐయూ నాయకులు కె.మహంకాళి, దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర కుమార్, బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఈద శేఖర్‌బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల, ప్రభుత్వ సంపదను దోచుకుంటూ విద్య, వైద్యాన్ని వ్యాపారం చేసి కార్పొరేట్లకు అప్పగిస్తోందని మండిపడ్డారు. మెడికల్ రిప్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.శ్రీనివాస్, టి.ప్రసాద్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి భైరవపట్నం గేటు మూసివేత

కైకలూరు: రైల్వేట్రాక్ మరమ్మతుల నిమిత్తం (లెవెల్ క్రాసింగ్ గేటు నం.79) పామర్రు–దిగమర్రు 165 జాతీయ రహదారిలో భైరవపట్నం రైల్వేగేటును ఈనెల 24న ఉదయం 7 గంటల నుంచి 30న రాత్రి 7 గంటల వరకు మూసివేస్తున్నట్టు సౌత్ సెంట్రల్ రైల్వే కైకలూరు సీనియర్ సెక్షన్ ఇంజనీర్ ఎండీ రెహమాన్ శనివారం తెలిపారు. గుడివాడ–కైకలూరు మార్గంలో ప్రయాణించే వాహనదారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

టూరిజం బోటు ప్రారంభం



బోటును ప్రారంభిస్తున్న దృశ్యం

పోలవరం రూరల్: పాపికొండలు అందాలను తిలకించేందుకు నూతనంగా ఏర్పాటు చేసిన టూరిజం బోటును అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ సెక్రటరీ చలపతిరావు శనివారం ప్రారంభించారు. కొరుటూరులో అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కాటేజీలు బుక్ చేసుకునే టూరిస్ట్‌లకు ఈ బోటు ఎంతో ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. ముందుగా ఆయన పట్టిసం శివక్షేత్రాన్ని దర్శించి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం రూ.20 లక్షలతో ఏర్పాటు చేసిన టూరిజం బోటును ప్రారంభించారు. రాజమండ్రి సీసీఎఫ్ డీఎన్ఎస్ మూర్తి, ఏలూరు డీఎఫ్ఓ సతీష్ రెడ్డి పాల్గొన్నారు.

దంచి కొట్టిన వాన



భీమడోలు జంక్షన్‌లో జలమయమైన రోడ్డు

భీమడోలు: భీమడోలు మండలవ్యాప్తంగా శనివారం సాయంత్రం వర్షం దంచి కొట్టింది. ఏకధాటిగా రెండు గంటలకు పైగా కురిసిన వర్షంతో జనజీవనం స్తంభించింది. భీమడోలు, గుండుగొలను, పూళ్ల, సూరప్పగూడెం తదితర గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా, పాఠశాలల ప్రాంగణాలు నీటిమునిగాయి. భీమడోలు జంక్షన్‌లో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన నీటితో రోడ్డు మునగడంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పలుచోట్ల చెట్లు కొమ్మలు విరిగి పడ్డాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. డ్రైయిన్లు పొంగి రోడ్లపై ప్రవహించాయి. భీమడోలు జంక్షన్ నుంచి సంత మార్కెట్ వరకు ఆర్అండ్‌బీ రహదారి భారీ గోతుల్లో వర్షం నీరు నిలవడంతో ఇటుగా ప్రయాణం ప్రమాదభరితంగా మారింది. భారీ వర్షంతో పాటు పిడుగులు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరించడంతో రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు.

వైద్య విద్యను ప్రైవేటుపరం చేస్తున్న కూటమి ప్రభుత్వం

మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ



తాడేపల్లిగూడెంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఆరోగ్యం అందించాలనే ఉద్దేశంతో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రానికి 17 మెడికల్ కళాశాలలను తీసుకువస్తే కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటుపరం చేస్తోందని మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడేపల్లిగూడెంలోని తన కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ సీఎం వైఎస్ జగన్ మెడికల్ కాలేజీలను ప్రారంభించలేదంటూ ప్రస్తుత కూటమి ప్రభుత్వం తప్పుడు ప్రచారాలు చేస్తోందన్నారు. జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే రాష్ట్రానికి మంజూరైన 17 వైద్య మెడికల్ కళాశాలల్లో పది కళాశాలలను పూర్తి చేసినట్టు చెప్పారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం 17 వైద్య కళాశాలలనూ ప్రైవేటుపరం చేసేందుకు చూస్తోందన్నారు. దీనివల్ల సామాన్యులు వైద్యవిద్యను అభ్యసించే అవకాశం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పికొట్టేందుకు వైద్య విద్యార్థులు రాష్ట్రంలోని ఆయా ప్రాంతాల్లో నిర్మించిన వైద్య కళాశాలల వద్ద నిరసన తెలియజేసేందుకు వెళితే తమ అసత్య ప్రచారాలు ప్రజలకు తెలిసిపోతాయన్న భయంతో కూటమి ప్రభుత్వం పోలీసులతో వారిని అడ్డుకుందని మండిపడ్డారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఒక్క మెడికల్ కళాశాల తెచ్చిన దాఖలాలు లేవని కొట్టు ఎద్దేవా చేశారు.

వైఎస్సార్ కన్న కల పోలవరం ప్రాజెక్టు

దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కన్న కల పోలవరం ప్రాజెక్టు అని కొట్టు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై భారం పడకుండా జాతీయ ప్రాజెక్టుగా దాని నిర్మాణం ప్రారంభించారని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు గురించి ఎన్నడూ ప్రయత్నించని చంద్రబాబు ఆ ప్రాజెక్టును తాను సాధించినట్టు చెప్పుకొంటున్నారని ఎద్దేవా చేశారు. కాపీ పేస్ట్ చేసుకోవడం బాబుకు అలవాటే అన్నారు. జాతీయ ప్రాజెక్టుగా ప్రారంభమైన పోలవరాన్ని చంద్రబాబు తన స్వార్థం కోసం రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకున్నారని విమర్శించారు. బహుళార్థ సాధక ప్రాజెక్టు అయిన పోలవరం ఎత్తును 47.17 మీటర్ల నుంచి 41.15 మీటర్లకు కుదించి దానిని ఆనకట్టగా మార్చేశారని తెలిపారు. చంద్రబాబు ప్రజలకు ఉపయోగపడే ఒక్క పథకాన్ని కూడా ప్రవేశపెట్టలేదన్నారు. కేవలం బెల్టుషాపులను ఏర్పాటు చేయడమే ఆయన ఘనతని ఎద్దేవా చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలనే పేర్లు మార్చి తమ పథకాలుగా ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు.

విద్యార్థులకు దగా

జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన అమ్మఒడి పథకాన్ని తల్లికి వందనం పేరుతో మార్పు చేసిన కూటమి ప్రభుత్వం 87 లక్షల మంది విద్యార్థులు ఉండగా కేవలం 52 లక్షల మందికే తల్లికి వందనం ఇస్తోందని కొట్టు సత్యనారాయణ విమర్శించారు. ఒక్కొక్కరికి రూ.15 వేలు ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం కొందరికి రూ.13 వేలు, మరికొందరికి రూ.11 వేలు, ఇంకొందరికి రూ.7 వేలు మాత్రమే ఇచ్చి మిగిలినవి తర్వాత ఇస్తామని మోసం చేస్తోందన్నారు.

భక్తులు చనిపోయినా స్పందించని డిప్యూటీ సీఎం

సింహాచలం, తిరుమలలో జరిగిన సంఘటనల్లో భక్తులు చనిపోయినా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎందుకు స్పందించడం లేదని కొట్టు సత్యనారాయణ ప్రశ్నించారు. తనను తాను సనాతన ధర్మాన్ని కాపాడే వ్యక్తిగా చెప్పుకొంటున్న ఆయన ఈ విషయంపై నోరు మెదపకపోవడం శోచనీయమని ఆయన అన్నారు.

చింతలపూడి కూటమిలో కొట్లాట

చింతలపూడి కూటమిలో కొట్లాటలు, కుమ్ములాటలు తారాస్థాయికి చేరాయి. మిగిలిన నియోజకవర్గాల్లో మాదిరిగా జనసేన వర్సెస్ టీడీపీ కాకుండా టీడీపీ వర్సెస్ టీడీపీ, జనసేన వర్సెస్ జనసేనలాగా రగడ సాగుతోంది. ఎమ్మెల్యే సొంగా రోషన్ వ్యవహారంపై టీడీపీ నేతలు సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేయగా, జనసేన ఇన్‌చార్జి తీరుపై ఆ పార్టీ నేతలు సోషల్ మీడియా వేదికగా బహిరంగంగా ఆరోపణలు గుప్పించడంతోపాటు డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు ఫిర్యాదు చేయడం కలకలం రేపుతోంది.

- సొంత పార్టీల్లోనే భగ్గుమంటున్న అసంతృప్తి
- ఎమ్మెల్యే తీరుపై అధిష్టానానికి టీడీపీ నేతల ఫిర్యాదు
- జనసేనలో ఇన్‌చార్జి తీరుపైనా మండిపాటు
- మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవి అమ్ముకున్నారంటూ జనసేన నేత ఆరోపణలు
- గందరగోళంలో చింతలపూడి కూటమి రాజకీయం



సాక్షిప్రతినిధి, ఏలూరు: చింతలపూడి కూటమిలో జరుగుతున్న పరిణామాల క్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ పదవిని సీనియర్లకు కాకుండా జనసేనలో కొత్తగా చేరిన వారికి కట్టపెట్టడం, దాని వెనుక నగదు లావాదేవీలు జరిగాయన్న ఆరోపణలతో నియోజకవర్గ రాజకీయం మలుపు తిరుగుతోంది.

మెట్ట రాజకీయాల్లో కీలకంగా..

మెట్ట ప్రాంత రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే చింతలపూడి కూటమి వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. నిన్నమొన్నటి వరకూ సహకార సొసైటీ పదవుల పంపకాల విషయంలో జనసేన, టీడీపీ నేతల మధ్య మాటల యుద్ధం, జన సేన ఇన్‌చార్జి ఏకంగా టీడీపీ ఎమ్మెల్యేను, ముఖ్యులను పరోక్షంగా విమర్శిస్తూ సోషల్ మీడియా పోస్టులతో హడావుడి చేశారు. పలు సమీకరణాలు, అంతర్గత వ్యవహారాలతో చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్, జనసేన ఇన్‌చార్జి మేకా ఈశ్వరయ్య సర్దుబాటు చేసుకున్నారు.

ఏఎంసీ పదవి చిచ్చు : తాజాగా మార్కెట్ యార్డు పదవి రెండు పార్టీల ముఖ్యుల మధ్య కాకుండా నేతల మధ్య చిచ్చురేపింది. నియోజకవర్గంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డు చైర్మన్ పదవికి మంచి డిమాండ్ ఉంది. ఏటా సుమారు రూ.9 కోట్ల నుంచి రూ.10 కోట్ల వార్షిక ఆదాయం ఉన్న మార్కెట్ యార్డు కావడం, నియోజకవర్గ స్థాయి పదవి తరహాలో ఉండటంతో జనసేన, టీడీపీ నుంచి విపరీతంగా నేతలు పదవి కోసం క్యూ కట్టి పలు రకాల లాబీయింగ్‌లు నిర్వహించారు. టీడీపీ నుంచి నందిగం తిలక్, సూరానేని గోపి అలాగే జనసేన నుంచి తూము నాగ విజయ్‌కుమార్, చీదరాల మధుబాబు ఈ పదవిని ఆశించారు. దాదాపుగా 7 నెలలకుపైగా నియామకానికి సంబంధించి తర్జనభర్జనలు, చర్చలు కొనసాగాయి. ఈ క్రమంలో ఏలూరు ఎంపీ కోటాలో తనకు ఖరారు అవుతుందని నందిగం తిలక్ భావించారు. అలాగే జనసేన కోటాలో తనకు అవకాశం వస్తుందని తూము విజయకుమార్ ఆశించారు. ప్రజారాజ్యం పార్టీ ఆవిర్భావం నుంచి క్రియాశీలక రాజకీయాల్లో ఉంటూ చిరంజీవి రక్తదానం, నేత్రదానం శిబిరాలు నిర్వహిస్తూ జనసేనలో కీలకంగా పనిచేస్తూ జిల్లా సహాయ కార్యదర్శిగా ఉన్న తనకు అవకాశం ఇస్తామని పార్టీ పెద్దలు హామీ ఇచ్చారని బలంగా నమ్మడంతో పాటు విజయ్‌కుమార్ అందరికీ చెప్పుకున్నారు. కట్ చేస్తే.. అనూహ్యంగా కొంత కాలం క్రితమే జనసేనలో చేరిన చిదరాల మధుబాబు సతీమణి దుర్గాపార్వతిని ఎంపిక చేశారు. నియామకం వెనుక ఎమ్మెల్యే, జనసేన ఇన్‌చార్జితో పాటు మంత్రి నాదెండ్ల మనోహర్ బలంగా పనిచేశారనేది టాక్. దీంతో విజయ్‌కుమార్ ఇన్‌చార్జి ఈశ్వరయ్య తీరుపై మండిపడుతూ సోషల్ మీడియాలో పోస్టు చేసిన వీడియో వైరల్‌గా మారింది. జన సైనికులను సోషల్ మీడియా పోస్టుల పేరిట ఇన్‌చార్జి అనుచరులు వేధిస్తారని, అలాగే నియామకం వెనుక నగదు లావాదేవీలున్నాయని ఆరోపించడం సంచలనంగా మారింది. నామినేటెడ్ పదవి పొందిన నేత భర్తపైన చీటింగ్ కేసు కూడా ఉందంటూ ఆరోపణలు గుప్పించడంతో జనసేన వర్సెస్ జనసేనగా రగడ సాగుతోంది.

ఎమ్మెల్యే తీరుపై ఫిర్యాదు

ఎమ్మెల్యే సొంగా రోషన్ మండలానికొక ముఖ్య నేతకు పెత్తనం అప్పజెప్పి పార్టీలో సీనియర్లను, మొదటి నుంచి పనిచేస్తున్న వారిని విస్మరించి ఏకపక్షంగా సాగుతుండటం చర్చనీయాంశంగా మారింది. దీంతో ప్రతి మండలంలోనూ ఎమ్మెల్యే వ్యతిరేక గ్రూపులు బలంగా కొనసాగుతున్నాయి. కామవరపుకోటకు చెందిన కొందరు నేతలు నేరుగా సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే కొద్దిరోజులు క్రితం సమావేశం నిర్వహించి తనపై ఎవరు ఫిర్యాదు చేసినా అధిష్టానం పట్టించుకోదని.. తాను, ఎంపీ కలిసే ఉన్నామని తమ ఇద్దరి మీద ఎవరు ఏంచెప్పినా ఉపయోగం లేదంటూ వ్యాఖ్యలు చేయడం టీడీపీలో మరో చర్చకు దారి తీసింది.

క్లుప్తంగా

శ్రీవారి సేవలో మద్రాస్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి



మద్రాస్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి నూతి రామ్మోహనరావుకు శ్రీవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ ఏఈఓ రమణరాజు

ద్వారకాతిరుమల: శ్రీవారి దివ్య క్షేత్రాన్ని శనివారం మద్రాస్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ నూతి రామ్మోహనరావు సందర్శించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముందుగా దేవస్థానం అధికారులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన శ్రీవారు, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు న్యాయమూర్తికి స్వామివారి శేష వస్త్రాన్ని కప్పి వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ ఏఈఓ రమణరాజు చినవెంకన్న చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.

హైకోర్టు న్యాయమూర్తి సురేష్‌రెడ్డికి ఘనస్వాగతం



హైకోర్టు న్యాయమూర్తి కే.సురేష్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసిన ఎస్పీ శివకిషోర్

ఏలూరు టౌన్ : ఏపీ హైకోర్టు న్యాయమూర్తి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి కే.సురేష్‌రెడ్డి ఏలూరు పర్యటన నేపథ్యంలో ఏలూరు రెవెన్యూ అతిథి భవనానికి వచ్చారు. హైకోర్టు న్యాయమూర్తి సురేష్‌రెడ్డిని జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి, మొదటి అదనపు జిల్లా జడ్జి ఎం.రామకృష్ణంరాజు, రెండో అదనపు జిల్లా జడ్జి ఇందిరా ప్రియదర్శిని, ఐదో అదనపు జిల్లా జడ్జి ఆర్‌వీవీఎస్ మురళీకృష్ణ, ఏడో అదనపు జిల్లా జడ్జి వై.శ్రీనివాసరావు, ఎనిమిదో అదనపు జిల్లా జడ్జి ఐ.శ్రీనివాసమూర్తి, పోక్సో స్పెషల్ జడ్జి కే.వాణిశ్రీ, పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్‌పర్సన్ మేరీగ్రేస్ కుమారి, జిల్లాలోని ఇతర న్యాయమూర్తులు హాజరయ్యారు.

అక్షరమే ఆయుధం

భావ వ్యక్తీకరణ స్వేచ్ఛకు భంగం



ప్రభుత్వంలోకి వచ్చే ప్రజాప్రతినిధులు పదవీ ప్రమాణ సందర్భంగా గవర్నర్ ముందు చేసిన ప్రమాణానికి విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారు. రాజ్యాంగంలోని మౌలికసూత్రాలకు భంగం కలిగిస్తున్నారు. పౌర, వ్యక్తిగత స్వేచ్ఛకు ఆటంకం కలిగిస్తున్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 ప్రకారం ప్రతి వ్యక్తికి భావ వ్యక్తీకరణ, వాక్ స్వాతంత్రపు హక్కులు ఉన్నాయి. స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్ల గడిచినా ఇది ఎక్కడా అమలు కావడంలేదు. పత్రికా స్వేచ్ఛకు అవరోధం కలిగించడం మంచి పరిణామం కాదు.

– హరిదాసుల రవీంద్రకుమార్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఇంటెలెక్చువల్ కమిటీ కార్యదర్శి

కూటమి నిరంకుశత్వానికి నిదర్శనం



సమాజంలో నాలుగో స్తంభంగా ఉన్న పత్రికా రంగంపై కక్షపూరితంగా అక్రమ కేసులు బనాయించడం దారుణం. ప్రజాస్వామ్యంలో ఎవరూ అడ్డు ఉండకూడదు, విమర్శించకూడదనే భావన నిరంకుశత్వానికి నిదర్శనం. పత్రికలు సమాజంలో అన్యాయాలపై ప్రశ్నిస్తాయి. ప్రచురించిన కథనాల్లో లోపాలుంటే వివరణ ఇవ్వాలేగాని కక్ష సాధింపులకు దిగడం సరికాదు. పత్రికా స్వేచ్ఛకు గండి కొట్టేలా ఏ ప్రభుత్వం కూడా చర్యలు తీసుకోరాదు.

– ప్రత్తిపాటి తంబి, వైఎస్సార్‌సీపీ ఏలూరు నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడు

నారికేళం.. ధరహాసం

- వరుస పండుగలతో పెరుగుతున్న కొబ్బరికాయ ధరలు
- రైతుల వద్ద వెయ్యి కాయలు రూ. 27 వేలు
- క్షేత్రాల్లో సైజును బట్టి రూ.30 నుంచి రూ.50కి విక్రయాలు
- ముందెన్నడూ ఇంత ధర లేకపోవడంతో రైతుల హర్షం
- కొనేందుకు వెనకాడుతున్న భక్తులు.. తగ్గిన విక్రయాలు



శ్రీవారి కొండపైన ఓ దుకాణంలో కొబ్బరి కాయలు కొంటున్న భక్తులు

ద్వారకాతిరుమల : కొబ్బరికాయల ధర మరింత పెరిగింది. దీపావళి, ఆ తరువాత కార్తీకమాసం సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో కొబ్బరి కాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఇప్పటికే కనీవినీ ఎరుగని రీతిలో ధరలు పెరగడంతో పలు క్షేత్రాలను సందర్శిస్తున్న భక్తులు కొబ్బరి కాయలు కొనలేక గగ్గోలు పెడుతున్నారు. ప్రస్తుతం రైతులు వెయ్యి కొబ్బరి కాయలను రూ. 27 వేలకు విక్రయిస్తున్నారు. చిన్నా, పెద్దా, లేత, ముదురు, ఎండు, పచ్చి అనే తేడా లేకుండా అన్ని రకాల కాయలను ఇదే ధరకు అమ్ముతున్నారు. ఇదిలా ఉంటే నెల రోజుల నుంచి రికార్డు స్థాయిలో ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. గతంలో కొబ్బరి కాయకు రూ.20 ధర రావడాన్ని రైతులు చూడలేదు. అలాంటిది ఊహించని విధంగా ఇప్పుడు ఇంత ధర పలుకుతుండటంతో రైతులు ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. వరుస పండుగలు, ఆ తరువాత కార్తీకమాసం కావడంతో ధర అనూహ్యంగా పెరిగింది. ప్రస్తుత పరిస్థితులను చూస్తే నారికేళం ధర ఇప్పట్లో దిగివచ్చేలా కనిపించడం లేదు.



రూ.40 పలుకుతున్న కొబ్బరికాయ

ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు..

ప్రస్తుతం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నుంచి రోజుకు 70 లారీలకు పైగా కొబ్బరి కాయలు గుజరాత్, ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, బీహార్, పశ్చిమబెంగాల్‌కు ఎగుమతి అవుతున్నాయి. స్థానికంగా ధరల పెరుగుదలకు ఈ ఎగుమతులు కూడా ఒక కారణమని వ్యాపారులు చెబుతున్నారు. మహారాష్ట్ర నుంచి డిమాండ్ ఉంటే నెల క్రితమే ఒక్కో కొబ్బరికాయ ధర రూ. 28కు చేరేదని అంటున్నారు.

మొక్కుబడులు వాయిదా..

కోరిన కోర్కెలు తీరడంతో శ్రీవారి క్షేత్రానికి మొక్కులు చెల్లించేందుకు వస్తున్న భక్తులు కొబ్బరి కాయల ధరలను చూసి హడలిపోతున్నారు. ఈ క్రమంలోనే 101, ఆపై కొబ్బరి కాయల మొక్కుబడి ఉన్న పలువురు భక్తులు తమ మొక్కులను వాయిదా వేసుకుంటున్నారు. సామాన్య భక్తులు సైతం అంత ధర పెట్టి కొబ్బరికాయను కొనేందుకు ఆలోచిస్తున్నారు. దాంతో కొందరు వ్యాపారులు కొబ్బరికాయ రేటు చెబితే భక్తులు కొనడం లేదని గ్రహించి, పూజా సామాగ్రితో కలిపి సెట్టు రూ.100కు విక్రయిస్తున్నారు. కొబ్బరికాయల ధరలు మరింతగా పెరిగితే వ్యాపారాలు సాగడం కష్టమేనని అంటున్నారు

సైజును బట్టి ధర

పుణ్యక్షేత్రాల్లో వ్యాపారులు ఒక్కో కొబ్బరి కాయను రూ.30 నుంచి రూ.45కు విక్రయిస్తున్నారు. రైతుల నుంచి అన్ని సైజుల కాయలను ఒకే ధరకు కొనుగోలు చేస్తున్న వ్యాపారులు, వాటిని గ్రేడింగ్ చేసి అతి చిన్న కాయను రూ.30కు, మీడియం సైజు కాయను రూ.35 నుంచి రూ. 40కు, పెద్ద కాయను రూ. 45 నుంచి రూ.50కు విక్రయిస్తున్నారు. దాంతో ద్వారకాతిరుమల దివ్య క్షేత్రాన్ని సందర్శిస్తున్న భక్తులు కొబ్బరి కాయలు కొనేందుకు గగ్గోలు పెడుతున్నారు.

చిన్న కాయ రూ.30



శ్రీవారి దర్శనార్థం క్షేత్రానికి వచ్చాను. కొండపైన దుకాణంలో ఒక్కో కొబ్బరి కాయ రూ.40, రూ.50 చెప్పారు. అంత పెట్టి కొనలేక ఒక్కో కాయకు రూ.30 ఇచ్చి, రెండు చిన్న కాయలను కొనుగోలు చేశాను. మూడు నెలల క్రితం ఈ సైజు కాయ రూ.10 ఉండేది.

– కొల్లి జ్యోతి – భక్తురాలు, విజయనగరం

తప్పదు మరి



స్వామివారి దర్శనానికి వచ్చిన ప్రతిసారి కొబ్బరి కాయ కొడుతుంటాను. కానీ ఇంత ధర ఎప్పుడూ చూడలేదు. బాగా చిన్న కాయ రూ. 30, కాస్త పెద్ద కాయ రూ.35 నుంచి రూ.40 చెప్పారు. దేవుడి దగ్గరకు వచ్చి రూ.10, రూ.20 దగ్గర వెనకాడటం ఎందుకని కొబ్బరి కాయ కొన్నాను.

– నరసింహశెట్టి శ్రీనివాసరావు, భక్తుడు, విజయవాడ

ఇంత ధర ఊహించలేదు



ఎన్నో ఏళ్ల నుంచి కొబ్బరి తోటలను కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాను. కొబ్బరి కాయకు ఇంత ధర వస్తుందని ఎప్పుడూ ఊహించలేదు. గతంలో రూ.7 ఉన్న కొబ్బరి కాయ ధర ఇప్పుడు రూ. 27కు చేరింది. ప్రస్తుతం వ్యాపారులు వెయ్యి కాయలను రూ. 27 వేలకు కొంటున్నారు. హోల్‌సేల్ వ్యాపారులు వాటిని రూ. 30 వేలకు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు.

– మానుకొండ రవి – కొబ్బరి కౌలు రైతు, పంగిడిగూడెం, ద్వారకాతిరుమల మండలం

కొనేందుకు ఆలోచిస్తున్నారు



గతంతో పోలిస్తే కొబ్బరి కాయల విక్రయాలు బాగా తగ్గాయి. అంతెందుకు నెల రోజుల క్రితం రూ.20కు అమ్మిన కాయను, ప్రస్తుతం రూ. 30కు అమ్మాల్సి వస్తోంది. లేకపోతే గిట్టుబాటు కావడం లేదు. ధర ఎక్కువగా ఉందంటూ భక్తులు కొబ్బరి కాయలు కొనేందుకు ఆలోచిస్తున్నారు.

– మసిముక్కుల గంగయ్య, కొబ్బరి కాయల వ్యాపారి, ద్వారకాతిరుమల

చీడపీడలపై రైతులను అప్రమత్తం చేయాలి



మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానంలో శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ టి.శ్రీనివాస్

పెనుమంట్ర : ప్రస్తుత సార్వా వరి పంట పిలకలు కట్టే దశ నుంచి చిరుపొట్ట దశలో ఉందని, ఈ పంటపై అక్కడక్కడా ఆకుముడుత, ఆకు నల్లి, బాక్టీరియా ఆకు ఎండుతెగులు ఆశించినట్లుగా రైతులు చెబుతున్నారని సహ పరిశోధన సంచాలకుడు డాక్టర్ టి.శ్రీనివాస్ చెప్పారు. శనివారం మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో శిక్షణ, సందర్శన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి జెడ్.వెంకటేశ్వర రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ చీడ పీడల నివారణపై రైతులను అప్రమత్తం చేయాల్సిన బాధ్యత వ్యవసాయ అధికారులపై ఉందని తెలిపారు. దాళ్వాలో రైతుల విత్తన అవసరాలు కొంతవరకు తీర్చడానికి వీలుగా ఎంటీయు 1121 ఫౌండేషన్ విత్తనం వచ్చే నవంబర్ కల్లా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దాళ్వాకు అనువైన సన్న గింజ ఎంటీయు 1282 ఉండి కృషి విజ్ఞాన కేంద్రంలో అందుబాటులో ఉండలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

బంగారు ఆభరణాల అపహరణ



చికిత్స పొందుతున్న బాధితురాలు ఆదిలక్ష్మి

నరసాపురం రూరల్: ఒంటరిగా ఇంట్లో ఉన్న మహిళపై కర్రతో దాడి చేసి ఆమె ఒంటిపై బంగారు ఆభరణాలను దుండగుడు అపహరించుకు పోయాడు. మొగల్తూరు ఎస్సై జి.రాజు తెలిపిన వివరాల ప్రకారం.. కాళీపట్నం తూర్పు గ్రామానికి చెందిన సుమారు 55 ఏళ్ల బళ్ళ సూర్య ఆదిలక్ష్మి ఒంటరిగా నివసిస్తోంది. ఆమె వద్ద పాత కలప కొనుగోలుకు వచ్చిన మారం శ్రీనివాస్ శనివారం ఉదయం ఆమెపై దాడిచేసి కొట్టి గాయపరిచాడు. ఆమె తలకు బలమైన గాయమై అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. ఆమె ఒంటిపై బంగారు ఆభరణాలను శ్రీనివాస్ అపహరించుకుపోయాడు. బాధితురాలి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఆదిలక్ష్మిని నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం చేయిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని ఎస్పీ నయీం అస్మి, డీఎస్పీ శ్రీ వేద, సీఐ దుర్గా ప్రసాద్ సందర్శించి వివరాలు సేకరించారు.

కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి

వీరవాసరం: అమెరికా సుంకాలకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం వీరవాసరం మండలం ఐదో మహాసభ డిమాండ్ చేసింది. వీరవాసరంలో శనివారం మండల అధ్యక్షుడు రెడ్డి రామారావు అధ్యక్షతన జరిగిన మహాసభలో జిల్లా అధ్యక్షుడు జుత్తిగ నరసింహమూర్తి జెండా ఆవిష్కరించారు. అనంతరం సభలో జిల్లా కార్యదర్శి ఆకుల హరేరామ్ పాల్గొని అమెరికా ప్రభుత్వం 50 శాతం పన్నులు విధించడం అన్యాయమన్నారు. ఈ పన్నుల భారం దేశ, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపనుందన్నారు. ఆక్వారంగాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్వా ఉత్పత్తులను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తానని భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రధాని అమెరికాతో చర్చలు జరపాలని ప్రత్యామ్నాయ మార్గాలను చేపట్టాలని కోరారు. సభలో బాలం విజయకుమార్ ,తాళ్లూరి హరిహర లక్ష్మణ్ ,యాళ్ల బండి నారాయణమూర్తి పాల్గొన్నారు.

వాచ్‌మెన్‌పై దొంగ దాడి

తణుకు అర్బన్: వాచ్‌మెన్‌గా విధుల్లో ఉన్న వృద్ధుడిపై గుర్తుతెలియని దుండగుడు దాడిచేసి సొత్తు దోచుకున్న ఘటన శుక్రవారం రాత్రి తణుకులో జరిగింది. తణుకు సజ్జాపురంలోని జ్యూపిటర్ ఎగ్ ట్రేడర్స్ కార్యాలయంలో రాత్రి సమయంలో వాచ్‌మెన్‌గా ఇరగవరం మండలం తూర్పువిప్పర్రుకు చెందిన వృద్ధుడు ముత్యాల వెంకట్రావు విధుల్లో ఉన్న సమయంలో.. గుర్తుతెలియని అగంతకుడు దాడిచేసి రూ.95వేలు దోచుకుపోయాడు. రాత్రి ఘటన జరగగా ఉదయం వరకు ఎవరూ చూడకపోవడంతో వృద్ధుడు ముక్కు నుంచి రక్తస్రావంతోపాటు కన్నుపై గాయంతో ఆవరణలోనే పడి ఉన్నాడు. ఉదయం వచ్చిన వారు చూసి పోలీసులకు ఇచ్చిన సమాచారంతో వృద్ధుడిని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు.

స్కూల్ గేమ్స్ ఎంపికలు వాయిదా

వీరవాసరం: ఈ నెల 22న జరగాల్సిన అండర్ 14, అండర్ 17 బాలబాలికల టేబుల్ టెన్నిస్, మాల్కంబ్, ఫెన్సింగ్, బాక్సింగ్, లాన్ టెన్నిస్ ఎంపికలు వాయిదా వేస్తున్నట్లు పశ్చిమగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శులు శ్రీమతి డి.సునీత, పీఎస్ఎస్ మల్లేశ్వరరావు శనివారం తెలిపారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ కమిటీల్లో నియామకాలు



యరకరాజు ఉమాశంకర్ రాజు



గంటా రాహుల్ రిచర్డ్స్

భీమవరం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాకు చెందిన ఇద్దరి రాష్ట్ర అనుబంధ విభాగాల్లో నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ప్రకటన జారీ చేసింది. స్టూడెంట్ వింగ్ సెక్రటరీగా భీమవరం పట్టణానికి చెందిన గంటా రాహుల్ రిచర్డ్స్, రాష్ట్ర బూత్ కమిటీ వింగ్ జనరల్ సెక్రటరీగా వీరవాసరం మండలం కొణితివాడకు యరకరాజు ఉమా శంకర్‌రాజు నియమితులయ్యారు. 8 = వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర దివ్యాంగుల విభాగం ప్రధ

ముగ్గురికి పార్టీ పదవులు



కొప్పుల రవిచంద్రారెడ్డి



రాపోలు భావనరుషి



కనికళ్ల ప్రసాద్



ఆతుకూరి సుబ్బారావు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన రాపోలు భావన రుషి రాష్ట్ర వీవర్స్ వింగ్ కార్యదర్శిగా, పంగిడిగూడెంకు చెందిన కొప్పుల రవిచంద్రా రెడ్డి రాష్ట్ర విద్యార్థి విభాగం కార్యదర్శిగా, తాడువాయికి చెందిన కనికళ్ల ప్రసాద్ రాష్ట్ర బూత్ కమిటీ విభాగం కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధినేత జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటామన్నారు. పార్టీని బలోపేతం చేసేందుకు కృషిచేస్తామని తెలిపారు.

మున్సిపల్ విభాగం కార్యదర్శిగా సుబ్బారావు



తాటిపర్తి రాజు



సాయన కనకరాజు

చింతలపూడి: చింతలపూడి నగర పంచాయతీకి చెందిన ఆతుకూరి సుబ్బారావును రాష్ట్ర మున్సిపల్ విభాగం కార్యదర్శిగా నియమిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

దివ్యాంగుల విభాగం ప్రధాన కార్యదర్శిగా రాజు

చింతలపూడి: వైఎస్ఆర్‌సీపీ దివ్యాంగుల విభాగం ప్రధాన కార్యదర్శిగా చింతలపూడి మండలం మల్లేశ్వరం గ్రామానికి చెందిన తాటిపర్తి రాజుని నియమిస్తూ శనివారం ఉత్తర్వు లు జారీ చేశారు.

సాంస్కృతిక విభాగం కార్యదర్శిగా కనకరాజు

కామవరపుకోట: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యదర్శిగా కామవరపుకోటకు చెందిన సొసైటీ మాజీ చైర్మన్ సాయన కనకరాజును నియమించారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

టీచర్స్ యూనియన్ జనరల్ సెక్రటరీగా ప్రతాప్



వరికూటి ప్రతాప్

ముసునూరు/నూజివీడు: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర టీచర్స్ యూనియన్ స్టేట్ జనరల్ సెక్రటరీగా ముసునూరు జెడ్పీటీసీ డాక్టర్ వరికూటి ప్రతాప్ నియమితులయ్యారు. నూజివీడు నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావుకు ముఖ్య అనుచరుడిగా, పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న ఆయనను స్టేట్ పదవికి ఎన్నుకోవడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. శక్తి వంచన లేకుండా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన చెప్పారు.

టెక్‌జైట్-25 పోస్టర్ ఆవిష్కరణ



టెక్‌జైట్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తోన్న డైరెక్టర్ అమరేంద్రకుమార్, ఇతర అధికారులు

నూజివీడు: నూజివీడు ట్రిపుల్ ఐటీలో డిసెంబర్ 18 నుంచి 20 వరకు నిర్వహించనున్న టెక్‌జైట్-25 కార్యక్రమం పోస్టర్‌ను శనివారం డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ ఈ టెక్‌జైట్‌ను ఈ సారి క్వాంటం టెక్నాలజీస్–షేపింగ్ ద ఫ్యూచర్, వన్ క్యాంటమ్ లీప్ ఎట్ ఏ టైమ్ అనే థీమ్‌తో నిర్వహిస్తున్నామన్నారు. ఈ టెక్‌జైట్‌లో టెక్నికల్ ఈవెంట్స్, ఇన్నోవేషన్ ఎగ్జిబిషన్, రోబోటిక్స్ పోటీలు, పేపర్ ప్రజెంటేషన్‌లు, హాక్‌థాన్ పోటీలు, మేనేజ్‌మెంట్ కార్యకలాపాలతో పాటు సాంస్కృతిక సంబరాలను నిర్వహిస్తారన్నారు. టెక్నాలజీ, మేనేజ్‌మెంట్, ఇన్నోవేషన్, క్రియేటివిటీని ప్రోత్సహిస్తూ విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకు ఈ టెక్‌జైట్ వేదికగా నిలుస్తుందన్నారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సెంట్రల్ డీన్ దువ్వూరి శ్రావణి, ఏఓ లక్ష్మణ రావు, డీన్ సాదు చిరంజీవి, డీఎస్‌డబ్ల్యుఓ లు రాజేష్, దుర్గాభవాని, హెచ్ఓడీలు పాల్గొన్నారు.

ఎరువుల షాపులపై విజిలెన్స్ దాడులు



జీలుగుమిల్లిలో ఎరువుల షాపు వద్ద తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

బుట్టాయగూడెం: మండల కేంద్రమైన జీలుగుమిల్లిలో ఎరువుల డిపోలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, వ్యవసాయ అధికారులు సంయుక్తంగా శనివారం తనిఖీలు నిర్వహించారు. విజయ ట్రేడర్స్‌లో లైసెన్స్ లేని ఎరువులను గుర్తించినట్లు జీలుగుమిల్లి ఏఓ గంగాధర్ తెలిపారు. విజిలెన్స్ డీఎస్పీ సింగులూరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ తనిఖీలు నిర్వహించారు. షాపును సీజ్ చేయడంతో పాటు క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు చెప్పారు. సాదు ట్రేడర్స్ షాపులో రూ.1,89,414 విలువైన 19.800 టన్నుల ఎరువుల వ్యత్యాసాన్ని గుర్తించి షాపును సీజ్ చేసి, యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఏఓ చెప్పారు.

వైనాట్ సంస్థకు ఎక్సలెన్స్ అవార్డు



విజయవాడలో టైమ్స్ ఆఫ్ ఇండియా అవార్డును అందుకున్న వైనాట్ సంస్థ ఎండీ మౌనిక

తణుకు అర్బన్: వైనాట్ ఎలక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ టైమ్స్ ఆఫ్ ఇండియా అవార్డును వరుసగా నాలుగోసారి దక్కించుకున్నట్టు ఆ సంస్థ అధినేత జుజ్జువరపు వెంకటరాయుడు తెలిపారు. 2025 ఏడాదికి ఆంధ్రప్రదేశ్‌లో ఎలక్ట్రానిక్స్ అండ్ గృహోపకరణాల స్టోర్‌లో ఎక్సలెన్స్‌గా నిలిచినందుకు ఈ అవార్డుకు ఎంపిక చేసినట్టు పేర్కొన్నారు. శనివారం రాత్రి విజయవాడ ఏ ప్లస్ కన్వెన్షన్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ ఎండీ జె.మౌనిక ఈ అవార్డును అందుకున్నట్టు చెప్పారు.

విద్యుదాఘాతంతో కాంట్రాక్ట్ ఉద్యోగి మృతి

ఆకివీడు: మండలంలోని చినకాపవరంలో టెలిఫోన్ కాంట్రాక్టు ఉద్యోగి దేవులూరి సత్యనారాయణ విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు హెడ్ కానిస్టేబుల్ జే.నాగేశ్వరరావు శనివారం చెప్పారు. గ్రామంలోని టెలిఫోన్ స్తంభం ఎక్కి నెట్ కేబుల్ వైరు కడుతుండగా విద్యుత్ వైర్లు తగిలి షాక్‌కు గురై కింద పడిపోవడంతో అతనిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ చెప్పారు.

క్లుప్తంగా

ఆస్పత్రి ఆవరణలో చెత్త, వ్యర్థాలు పారవేయరాదు



జిల్లా కేంద్ర ఆస్పత్రిలో నర్సింగ్ విద్యార్థులతో సూపరింటెండెంట్ డాక్టర్ సాయికిరణ్

తణుకు అర్బన్: ఆస్పత్రిలో రోగుల సౌకర్యార్థం పారిశుద్ధ్య నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కాకర్లమూడి సాయికిరణ్ అన్నారు. తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో శనివారం స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య నిర్వహణతో పాటు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రి ఆవరణలో చెత్త, వ్యర్థాలు పారవేయరాదని, పారిశుద్ధ్య కార్మికులకు సహకరించాలని కోరారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ కృపావరం, వైద్యులు, నర్సులు, ఎస్ ఎం నర్సింగ్ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

గ్రామ వార్డు సచివాలయ నూతన కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కమిటీకి నియామక పత్రాలు ఇస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు జోసెఫ్ కిషోర్

తణుకు అర్బన్: తణుకు మండల గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం డెమొక్రటిక్ అసోసియేషన్‌ను నూతనంగా నియమించినట్లు ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు జి.జోసెఫ్ కిషోర్ తెలిపారు. తణుకు మండలం తేతలి రైతు భరోసా కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు వివరించారు. తణుకు మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా పి షకీల, ఎన్ హారిక నియమితులయ్యారని, ఎగ్జిక్యూటివ్ బాడీ మెంబర్స్‌గా ఎన్ జయవర్ధన్ అయ్యప్ప, డి మల్లికార్జునరావు, ఏ.అనిత, జి దుర్గాప్రసాద్, పి రాజేంద్ర బాబు, కె.సత్యవాణి, దివ్య సుస్మిత, పి.దివ్య సాయిలను ఎన్నుకున్నట్లు చెప్పారు. సంఘ కోశాధికారి డి దుర్గాప్రసాద్, నరసాపురం పట్టణ అధ్యక్షుడు పి.మదన్మోహన్ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగినట్లు వివరించారు.

రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

పెంటపాడు: రాష్ట్రంలో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసి, తమ కమ్యూనిటీ గౌరవాన్ని కాపాడాలని ఆర్సీడీఎస్ సంఘ సభ్యులు డిమాండ్ చేశారు. శనివారం పెంటపాడులో రెడ్డి కమ్యూనిటీ డవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నాయకులు నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం కళాశాల సెంటర్ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ప్రభుత్వం తక్షణం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్సీడీఎస్ రీజినల్ కోఆర్డినేటర్ చిర్ల వెంకట సత్యనారాయణరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి విజయానందరెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు పోతంశెట్టి లక్ష్మి, జిల్లా అధ్యక్షుడు కర్రి శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి సురేష్‌రెడ్డి, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు కర్రి హైమావతి, సింగారెడ్డి లక్ష్మీనారాయణరెడ్డి, వెలగల లింగారెడ్డి, గొలుగూరి శేషారెడ్డి, కర్రి మురళీకృష్ణారెడ్డి, పల్లి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి రూ. లక్ష విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి ఒక భక్తుడు శనివారం లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. తణుకుకు చెందిన ఓలేటి నాగేంద్ర కృష్ణ ముందుగా సతీ సమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్ విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

కొండేపాడులో 200 మందికి ఉచిత వైద్యపరీక్షలు

పెంటపాడు: మండలంలోని కొండేపాడు గ్రామంలో శనివారం నగేష్ ఆధ్వర్యంలో ఉచిత మోగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా తణుకు జెకే ఆసుపత్రికి చెందిన ఊపిరితిత్తుల వ్యాధుల నిపుణులు డాక్టర్ లోకేశ్వరరెడ్డి పల్మనాలజీకి సంబంధించి పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ తప్పక వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జేకే మేనేజింగ్ డైరెక్టర్ శివ, ముత్యాల నగేష్ కుటుంబ సభ్యులతోపాటు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ శాంతి దినోత్సవం

అత్తిలి: లయన్స్ క్లబ్ ఆఫ్ అత్తిలి ఆధ్వర్యంలో ప్రపంచ శాంతి దినోత్సవాన్ని శనివారం అత్తిలి ఎంఎం స్కూల్, వాగ్దేవి స్కూల్‌లో జరిపారు. ఈసందర్భంగా విద్యార్థులచే శాంతి ప్రతిజ్ఞ చేశారు. క్లబ్ అధ్యక్షుడు శిరగాని నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ప్రిన్సిపాల్ బండి అయ్యప్ప స్వామి, లయన్స్‌క్లబ్ జెడ్సీ పట్నాల వెంకటేశ్వరరావు, ఉలుసు భాస్కర రావు, యాతం రాంబాబు, దాసం బాబ్జీ, గొర్రెల వెంకట్రావు, సోమసుందరరావు పాల్గొన్నారు.

గోతులమయంగా రహదారులు



తాడేపల్లిగూడెం మండలం అప్పారావుపేట - కోరుమామిడి వెళ్లే ప్రధాన రహదారి



తాడేపల్లిగూడెం నుంచి మెట్ట ఉప్పరగూడెం వెళ్లే రహదారిపై ఎల్.అగ్రహారం వద్ద రహదారి దుస్థితి

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పలు రహదారులు గోతులమయంగా మారుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రహదారులపై ఏర్పడిన గోతుల్లో నీరు చేరి మరింత అధ్వానంగా తయారవుతున్నాయి. ప్రధానంగా తాడేపల్లిగూడెం – మెట్ట ఉప్పరగూడెం, అప్పారావుపేట – కోరుమామిడి బ్రిడ్జి, అప్పారావుపేట – జగన్నాథపురం, పట్టెంపాలెం – అప్పారావుపేట తదితర రహదారులపై ఈ పరిస్థితి నెలకొంది. భారీ లారీలు సైతం ఈ రహదారులపై రాకపోకలు సాగించడంతో దెబ్బతింటున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. రెండు జిల్లాలను కలిపే ప్రధాన రహదారులు కావడంతో పొరుగున నిడదవోలు మండలం నుంచి రైతులు తాము పండించిన కూరగాయల పంటలను తాడేపల్లిగూడెం మార్కెట్‌కు తీసుకొస్తుంటారు. ప్రస్తుతం రహదారుల పరిస్థితిని చూసి రైతులు విస్తుపోతున్నారు. ఈ రహదారులపై ప్రయాణించాలంటే వాహనాలు త్వరితగతిన మరమ్మతులకు వస్తున్నాయని వాపోతున్నారు. అప్పారావుపేట – కోరుమామిడి ప్రధాన రహదారి గత కొన్నేళ్లుగా అస్తవ్యస్తంగా తయారైంది. ఏళ్లు గడుస్తున్నా ఈ రహదారికి మోక్షం లభించడం లేదు. ఈ నేపథ్యంలో ఈ రహదారిపై ప్రయాణించేందుకు వాహనదారులు సైతం అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా, అధికారులు, ప్రభుత్వం స్పందించి రహదారులకు శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

'ఏడాదిన్నరలో' 13 హత్యలు

- మాజీ మంత్రి కొట్టు విమర్శ

తాడేపల్లిగూడెం అర్బన్: తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో లా అండ్ ఆర్డర్ దారుణంగా ఉందని మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ విమర్శించారు. తాడేపల్లిగూడెంలోని తన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడాదిన్నర కూటమి పాలనలో కేవలం తాడేపల్లిగూడెం పట్టణంలో 13 హత్యలు జరిగాయన్నారు. వీటి వెనుక ఉన్నది జనసేనకు చెందినవారేనని చెప్పారు. ఇటీవల పోలీస్ స్టేషన్ ఎదుట ఒక వ్యక్తి పైన 40 మందికి పైగా దాడి చేసి కొట్టినా పోలీసులు పట్టించుకోకపోవడం లా అండ్ ఆర్డర్ పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఒక తల్లి తన కూతురిని ప్రియుని వద్ద నుంచి తీసుకువెళితే దానిని కిడ్నాప్ అంటారా అని ప్రశ్నించారు. పట్టణంలో మద్యం అమ్మకాలు, డ్రగ్స్ విక్రయాలు పెరిగిపోయాయన్నారు. వీటి వెనుక ఉన్నవారిని స్థానిక ప్రజాప్రతినిధి సమర్థించడం వల్లే యథేచ్ఛగా ఈ అమ్మకాలు సాగుతున్నాయని ఆయన విమర్శించారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధి డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడకుండా పట్టణాభివృద్ధిపై దృష్టి పెట్టాలని ఆయన హితవు పలికారు. అనంతరం ముప్పిడి సంపత్‌కుమార్, కర్రి భాస్కర రావు, బొద్దాని శ్రీనివాస్ మాట్లాడారు. జడ్డు హరిబాబు, ప్రతి రాజబాబు, పత్స అంజిబాబు, మోషే, అచ్చిబాబు, సిర్రాపు శాంతకుమార్, కారింకి వీర్రాజు, జొన్నల సత్యనారాయణ పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి



విద్యార్థి సంఘ ఎన్నికల్లో విజేతలైన విద్యార్థినులతో ప్రిన్సిపల్ సుందరీబాయ్, అధ్యాపకులు

తణుకు అర్బన్: విద్యార్థి దశలోనే న్యాయకత్వ లక్షణాలను పెంపొందించుకుని విద్యార్థినులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల ప్రిన్సిపల్ యుఎల్ సుందరీబాయ్ అన్నారు. 2025–26 సంవత్సరానికి సంబంధించి శనివారం కళాశాలలో విద్యార్థినులకు విద్యార్థి సంఘ ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోటీతత్వం, టీమ్ మేనేజ్‌మెంట్ స్కిల్స్‌లో ప్రావీణ్యం సాధించాలని, ఎన్నికలు అంటే ఏమిటని, ఓటు హక్కు ఏవిధంగా వినియోగించుకుంటారనే విషయాలను తెలిపేందుకే విద్యార్థి సంఘ ఎన్నికలు నిర్వహిస్తారని అన్నారు. ఎన్నికల ప్రచారం, ఓటింగ్, ఓట్లు లెక్కింపు ప్రక్రియలపై విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల్లో విజేతలైన విద్యార్థినుల్లో చైర్‌పర్సన్‌గా కె.కీర్తిశ్రీ, కార్యదర్శిగా ఎం.మహిమ థెరిస్సా, వైస్ చైర్‌పర్సన్‌గా కె.మాధురి, కల్చరల్ కార్యదర్శిగా బి.షణ్ముఖేశ్వరి, పీజీ ఎగ్జిక్యూటివ్ మెంబరుగా టి.జాహ్నవి, జనరల్ కెప్టెన్‌గా జి.అశ్విని భవాని నియమితులయ్యారు. ఈ సందర్భంగా విజేతలైన విద్యార్థినులు అధ్యాపకులు అభినందించారు.

26న తెలుగు సాహితీ సమాఖ్య సమావేశం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని మునిసిపల్ కార్యాలయం సమీపంలోని మునిసిపల్ కాంప్లెక్స్ వద్ద ఈ నెల 26వ తేదీన శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు తెలుగు సాహితీ సమాఖ్య 660 సమావేశం నిర్వహిస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి పైలు శ్రీనివాసరావు, అధ్యక్షుడు మండ బ్రహ్మాజీలు వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా 130వ జయంతి సభ నిర్వహిస్తారని, జాషువా కవిత్వంపై ముఖ్య వక్త తెలుగు అధ్యాపకులు మల్లవెల్లి శ్రీరామ నాగ వరప్రసాద్ ప్రసంగిస్తారని తెలిపారు. జ్యోతి ప్రజ్వలన గౌరవాధ్యక్షులు ఈతకోట తాతాజీ, ముఖ్య అతిథులు, సాహితీ సమాఖ్య సభ్యులు, పట్టణ ప్రముఖులు హాజరవుతారని, విజయవంతం చేయాలని కోరారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



పుస్తకాలతో విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పలువురు వక్తలు తెలిపారు. గ్రేడ్ –1 ప్రథమశ్రేణి గ్రంథాలయంలో శనివారం 'చదువు అంటే మాకిష్టం' కార్యక్రమం శనివారం జరిగింది. స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. గ్రంథాలయ అధికారి వి.శ్రీనివాసరావు, సీనియర్ పాఠకులు వి.జాన్‌బాబులు మాట్లాడుతూ పాఠశాలలో ఆయా తరగతులకు సంబంధించిన పాఠ్యపుస్తకాలు ఉంటాయని, చక్కని చదువులు చదువుతారని తెలిపారు. గ్రంథాలయంలో అయితే జ్ఞానం, విజ్ఞానం, సైన్సు, ఆధ్యాత్మికరంగం, పంచతంత్ర కథలు, నీతి కథలు, నవల్స్, న్యూస్ పేపర్లు, మ్యాగజైన్స్, వివిధ రంగాలకు చెందిన పుస్తకాలు లభ్యం అవుతాయని తెలిపారు. పోటీ పరీక్షలకు యువత ప్రిపేర్ అవుతారని, గ్రంథాలయంలో చదివినవారు ఉన్నతాధికారులుగాను, డాక్టర్లుగాను, ఇంజనీర్లుగాను, శాస్త్రవేత్తలుగాను, ఉపాధ్యాయులు, బ్యాంక్ ఉద్యోగులుగా ఎంపిక అవుతారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు చిన్ననాటి నుంచే గ్రంథాలయానికి రావాలని, జ్ఞానాన్ని సంపాదించుకోవాలని, ఆ దిశగా అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు.

మద్యం దుకాణాలు, బార్లలో ప్లాస్టిక్ సామగ్రి వినియోగం నిషేధం



తణుకులో బార్‌లో ప్లాస్టిక్ సామాగ్రి వినియోగంపై సూచనలిస్తున్న సీఐ మణికంఠరెడ్డి

తణుకు అర్బన్: మద్యం షాపులు, బార్లలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగానికి స్వస్తి పలకాలని ఎక్సైజ్ సీఐ సత్తి మణికంఠారెడ్డి అన్నారు. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఏలూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ బి. శ్రీలత ఆదేశాల మేరకు శనివారం తణుకు పట్టణంలోని మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్‌లలో తణుకు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వ్యర్థాల నివారణకు సంబంధించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం షాపుల్లోను, బార్లలోను వాటర్ ప్యాకెట్లు, వాటర్ బాటిల్స్ వంటివి ఒకసారి వాడి పారేసే ప్లాస్టిక్ సామగ్రిని ఉపయోగించడం పూర్తిగా నిలిపివేయాలని, వాటి స్థానంలో బయో డిగ్రేడబుల్ ఉత్పత్తులు, తిరిగి వాడటానికి పనికి వచ్చే ఉత్పత్తులను ఉపయోగించాలని సూచించారు. యజమానులు తమ మద్యం షాపుల్లో ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పారేయకుండా తమ ప్రాంగణాల్లోనే విధిగా చెత్త బుట్టను ఏర్పాటు చేసుకుని వ్యర్థాలను కేవలం అందులో మాత్రమే వేసే విధంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇకపై పతిరోజు విధిగా తనిఖీలు నిర్వహిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు ఆర్. మధుబాబు, బి. లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.





పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



ఇరగవరంలో వైద్య శిబిరం ప్రారంభిస్తున్న దృశ్యం



వరిఘేడులో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం



వెంకట్రామన్నగూడెంలో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీహర్ష

ఇరగవరం: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఇరగవరం పీహెచ్‌సీ వైద్యురాలు మౌనిక తెలిపారు. మండలంలోని ఇరగవరం గ్రామంలో శనివారం 252మంది రోగులను పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యురాలు వై మౌనికా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్నా స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సహకార సంఘం అధ్యక్షుడు వేండ్ర నాగరాజేశ్వరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని మండలంలో అని గ్రామాల్లో అక్టోబర్ 2వ తేది వరకు జరుగుతుందన్నారు. గ్రామ సర్పంచ్ కంకిపాటి శ్రీనివాస్, ప్రోగ్రాం నోడల్ అధికారి డాక్టర్ కె ప్రతాప్ కిషోర్, తణుకు న్యూ లైఫ్ హస్పటల్ ప్రసూతి వైద్య నిపుణురాలు డాక్టర్ కె వందన, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడి సిబ్బంది, ఆశ వర్కర్లు, పాల్గొన్నారు.

పిల్లల సంరక్షణతో పాటు విద్య కూడా ముఖ్యం

అత్తిలి: బాల్య దశలో పిల్లల సంరక్షణతో పాటు విద్య కూడా ఎంతో ముఖ్యమని ఐసీడీఎస్ తిరుపతిపురం సెక్టార్ పర్యవేక్షకురాలు ఎం శ్రీదేవి అన్నారు. శనివారం అత్తిలి మండలం వరిఘేడు గ్రామంలో స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. హెల్త్ అసిస్టెంట్ స్వరూప, ఎంఎస్‌కె . సంధ్యారాణి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని వెంకట్రామన్నగూడెం గ్రామంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్వస్థ్ నారీ – స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీ డాక్టర్ శ్రీహర్ష మాట్లాడుతూ ప్రస్తుతం సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్తేరు రాణి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికల ఆహారంపై శ్రద్ధ వహించాలి



వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీ వద్ద పోషకాహార వంటకాల ప్రదర్శన

తాడేపల్లిగూడెం రూరల్: కిశోర బాలికలు ఆహారం పట్ల శ్రద్ధ వహించాలని కొత్తూరు సర్పంచ్ కే. హనుమంతరావు అన్నారు. రాష్ట్రీయ పోషణ మాసోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని కొత్తూరులో పోషణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహారాన్ని తీసుకుని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మాధవరం పీహెచ్‌సీ వైద్యురాలు టి.సింధు మాట్లాడుతూ మహిళల్లో క్యాన్సర్ రకాల గురించి వివరించారు. ఎమ్పీటీసీ నరసింహమూర్తి, పంచాయతీ కార్యదర్శి మాధవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఎల్.అగ్రహారం, వెంకట్రామన్నగూడెం గ్రామాల్లో పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎస్తేరు రాణి, బేబి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గూడెంలో భారీ వర్షం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో శనివారం సాయంత్రం నుంచి ఆకాశం మేఘావృతం కావడంతో పాటు 4 గంటలకు ఒక్కసారిగా ఆకాశం చిల్లుపడినట్లుగా భారీ వర్షం పడింది. పెద్ద పెద్ద శబ్దాలతో సుమారు అర్ధగంట సేపు ఎడతెరపిలేకుండా కురిసిన వానతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఉదయం నుంచి ఎండతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలకు సాయంత్రం కురిసిన భారీ వర్షంతో సేద తీరారు. లోతట్టు ప్రాంతాలలో వర్షం నీరు నిలిచింది. రాత్రి వరకు ఆకాశం మేఘావృతం కావడంతో పాటు, సన్నపాటి చినుకులతో చల్లటి వాతావరణం నెలకొని ఉంది.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



ఉద్యాన వర్సిటీలో మొక్కలు నాటుతున్న అధికారులు



పెదతాడేపల్లి చెరువు గట్టున ప్రతిజ్ఞ చేయిస్తున్న సర్పంచ్ అన్నవరం

తాడేపల్లిగూడెం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఉద్యాన వర్సిటీలో జరిగిన కార్యక్రమంలో మొక్కలు నాటారు. శ్రమదానంచేసి స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌కు అందరూ కట్టుబడిఉంటామని ప్రతిజ్ఞ చేశారు. రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, డీన్ ఆఫ్ స్టూడెంట్సు సూర్యకుమారి, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు. మెరుగైన ప్రజా జీవనం కోసం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పట్టణంలోని ఒక విద్యాసంస్థలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ ఇ.స్వరాజ్యలక్ష్మి, విద్యార్థులను కోరారు. వేస్టు మేనేజ్‌మెంటు, అర్బన్ గార్డెనింగ్, టెర్రస్ గార్డెనింగ్ విషయాలపై మాట్లాడారు. మొక్క లు నాటారు. ఎక్సైజ్ ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు. మునిసిపాలిటీ ఆధ్వర్యంలో శివాలయం ఏరియాలో నిర్వహించిన కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు తదితరులు మొక్కలు నాటారు. అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటండి

తాడేపల్లిగూడెం రూరల్: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని పెదతాడేపల్లి సర్పంచ్ పోతు ల అన్నవరం అన్నారు. శనివారం మండలంలోని పెదతాడేపల్లి గ్రామంలో మొక్కలు నాటే కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అన్నవరం మాట్లాడుతూ మొక్కల ద్వారా కాలుష్యం లేని స్వచ్ఛమైన గాలి లభిస్తుందన్నారు. మొక్కలు నాటడం అందరి సామాజిక బాధ్యత అన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజా శ్రీనివాస్, ఉప సర్పంచ్ అత్తంటి సోమరాజు, ఎమ్పీటీసీ గోవింద్, సత్యనారాయణ, మండల ఉద్యాన శాఖ అధికారిణి శ్రీలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు టి. రవిచంద్ర, రఘు, ఎంఆర్‌సీ ఎం.రవికిరణ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.